క్షత్రియ మహిళ

1

రాణా హరసింహుని పంచకల్యాణి శరవేగంతో రివ్వున దూసుకు పోయింది. ఆ అశ్వం వెంటనంటిపోయే నలుగురైదుగురు వేటకాండ్ర గుర్రాలుకూడా వాయుశక్తులా మెడలు రిక్కించి మెరుపుల్లా పరుగులు పెట్టాయి.

వారందరూ కలిసి ఒక అడవిపందిని వెంటదరుముతున్నారు. అది వారెవ్వరికీ అందకుండా ముప్పుతిప్పలు పెడుతూ మూడు చెరువులనీళ్ళు తాగిస్తూంది.

అసలది అవలీలగా వారికి దొరికిపోయేదే!

ఆ అడవిపంది మిట్టమధ్యాహ్నంవేళ ఒక కొండగుహలో పడుకుని హాయిగా నిద్రపోతూంది. కాని రసపుత్రవీరుల కొక నిద్రపోతూన్న అడవి పందిని బల్లెంతో పొడిచి చంపడం అంటే చాలా పెద్ద తలవంపు! పందిని కొట్టినవాడే బంటు! అందులోనూ బరిమీదపడి పరిగెత్తుకు పోయే అడవి పందిని బల్లెంతో పొడిచి చంపినవాడొక పెద్దబంటు! అది ఆ కాలంలో గొప్ప వేట మర్యాద. వారందరూ పాలవంటి సుక్షత్రియ వంశంలో అవతరించిన మహాయోధులమని రొమ్ములు విరుచుకుని పొంగే వీరవరేణ్యులు!

వారి నాయకుడు రాణా హరసింహు డిటీవలనే చిత్తూరు సింహాసనంపై పట్టాభిషిక్తుడయిన మహారాజు! పట్టాభిషేకోత్సవాల మహోత్సాహంతోనే అత డా అనుచరులతో కలిసి అనేకవిధాలుగా మృగయా వినోదం చవిచూస్తున్నాడు. అటువంటివా డొక కొండగుహలో పడుకుని హాయిగా నిద్రపోయే అడవిపందిని బల్లెంతో పొడిచి చంపడాని కంగీకరిస్తాడా? కనుకనే ముందుగా వారంతా రాళ్ళువిసిరి దానిని బెదరగొట్టారు. లేస్తూనే అది ఒక పెద్ద దౌడుతీసింది. అంతలోనే కనుమరుగై ఆ మహారణ్యంలో ఎక్కడో దాక్కుని ఇట్టే మాయమైపోయింది!

హరసింహు డనుచరులతో కలిసి ఆ అరణ్యప్రాంతం అంతా గాలించాడు. ఎక్కడా దానిజాడే పొడకట్టలేదు!

వారంతకుపూర్వం పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్లు మొదలయిన క్రూర జంతువుల నెన్నింటినో సంహరించారు. అదేమి దురదృష్టమోగాని ఆ ఒక్క అడవిపంది వారి కందకుండా తప్పించుకుని పారిపోయింది! అది వారందరికీ ఒక పెద్ద తలవంపయింది. దాని నెలాగయినా వేటాడి తీరాలనీ, అంతవరకూ వేట ముగించి వెళ్ళిపోకూడదనీ వారందరూ గట్టిగా నడుములు బిగించారు.

ఆ అరణ్యప్రాంతం అంతా గాలించగా గాలించగా కొంతసేపటికి వారి కొకచోట కంగారుగా పారిపోయే అడవిపంది అడుగుజాడలు కొన్ని కనిపించాయి. వారందరికీ వెదకబోయే తీగ కాళ్ళకే తగిలినట్లయింది. వెంటనే దాని అడుగుజాడల మార్గంలో తమ గుర్రాలు పరుగెత్తించారు.

అప్పటికి మూడుఝాముల పొద్దుతిరిగింది. కొంతదూరం పోయేసరికి వారికొక పెద్ద జొన్నచేను తగిలింది. అది సుమా రొక మనిషి ఎత్తున బాగా ఒత్తుగా పెరిగిన చేను. అడవిపంది అడుగుజాడ లా జొన్నచేలో ప్రవేశించి అక్కడే అదృశ్యమై పోయాయి!

వారి కిక ఏమిచెయ్యడానికీ పాలుపోలేదు. అది నాలుగువైపులా బాగా విస్తరించిన పెద్దచేను. కొంచెం దూరంలో వారి కొక మంచె కనిపించింది. మంచెమీద కూర్చుని జొన్నకంకి గింజలు నములుతూ పిట్టల్ని బెదరగొడుతున్న ఒక కన్నెపడుచు వారిని చూస్తూనే లేచి నిలబడింది. మనుషులు నడిచే కాలిబాటమ్మటే గుర్రాలు నడిపించుకుంటూ వారంతా ఆ మంచె సమీపించారు. అందరూ మంచెదగ్గరికి రాగానే ఆ కన్నెపడుచు లేడిపిల్లలా చెంగున నేలమీదికి దూకింది.

హరసింహుని అనుచరులలో ఒక వృద్ధుడామెదగ్గిరికి నడిచివెళ్ళి ఎంతో ఆత్రంగా అడిగాడు :

“అమ్మాయీ! నీ కిక్కడ ఎక్కడైనా ఒక అడవిపంది కనిపించిందా? అది ఇప్పుడిప్పుడే ఈ చేలో దూరిందిలే!”

ప్రశ్న వింటూనే కన్నెపడుచు చెంగున మంచెమీది కెక్కింది. అలాగే కొంచెంసేపు కొన్ని జొన్నకంకి గింజలు నములుతూ నాలుగు వైపులా బాగా పరకాయించి చూచింది:

“అదుగదిగో! ఆమూల ఏదో కదులుతూన్నట్లుంది. సందేహం లేదు! అది అడవిపందే! పరిగెత్తండి!”

రౌతులంతా తమ గుర్రా లటువైపు పరిగెత్తించారు. ఆ ప్రాంతం అంతా గాలించారు. కాని వారి కెక్కడా అడవిపంది జాడే కనిపించ లేదు! గుర్రాలతో బాటు తాముకూడా నురగలు కక్కుతుంటూ తిన్నగా మంచె దగ్గిరికి తిరిగి వచ్చారు. పడుచు వారందరినీ చూచి కలకలా నవ్వింది:

“అయ్యో! ఇంత శ్రమపడ్డారే! మీ కెవ్వరికీ అది కనిపించనే లేదా!”

వారిలో ముసలి రౌతు కొంచెం సిగ్గుపడ్డాడు:

“ఎంత వెదికినా మా కెవరికీ అది కనిపించలేదు తల్లీ!”

ఈమా రా కన్యక మరి ఒక జొన్నకంకి పరపరా నమిలింది. ఇంకొకవైపు పరకాయించి చూచింది.

“అదుగో! అడివిపంది! వెళ్ళండి! వెళ్ళండి! పారిపోతూంది.”

మళ్ళీ గుర్రాలన్నీ నురుగులు కక్కుతుంటూ అటువైపు పరిగెత్తాయి. ఒక అరగడియలోనే అవ్వన్నీ మళ్ళీ తిరిగివచ్చాయి. ఈమా రా పడుచు మరింతగా విరగబడి నవ్వింది! ఆ నవ్వు సవ్వడి రౌతులందరికీ కొంచెం వింతగానే వినిపించింది. ఆ కొంటెపిల్ల తమతో పరియాచకాలకు దిగిందేమోనని వారికి కొంచెం అనుమానం కలగకపోలేదు. అయినా ముసలి రౌతు మరి గత్యంతరం లేక ఉసూరుమని నిట్టూర్చాడు:

“ఎక్కడా కనబడలేదమ్మా! అసలు నీ కది తిన్నగా కనిపించిందా?”

“అయ్యో! లేకపోతే నేనలాగ చెబుతానా! ఎంత మాట! మీరే దాన్ని పట్టుకోలేక పోయారు! అంతే! నేనైతే దా న్నిపాటికి నా బల్లెం కొసకి గుచ్చి బరబరా ఇక్కడి కీడ్చుకు వచ్చి వుందును!”

ఆ మాట లా వీరవరేణ్యు లందరికీ వాడి బల్లెం పోటుల్లా సూటిగా గుండెల్లో గుచ్చుకున్నాయి. రాణా హరసింహు డా పడుచు మాటల తీరు విని మరింత ఆశ్చర్య పోయాడు. ఆమె కింకా పద్ధెనిమిది ఏళ్ళయినా తిన్నగా నిండాయో లేదో అన్నట్లు మిసమిసలాడింది. చెంపల వరకూ

వ్యాపించిన చారెడేసి కళ్ళల్లో కొంత అమాయికత్వము, కొంత దుందుడుకు తనము, కొంత మితిమీరిన గుండె నిబ్బరము తొణికిసలాడాయి. హరసింహు డలాగే ఆశ్చర్యపోతూ అడిగాడు:

"సరే! నీ బడాయి మాటల కేమిలేగాని మళ్ళీ ఆ మంచెమీది కెక్కి అది ఎక్కడయినా కొంచెం మెదులుతూందేమో చూడు."

వెంటనే ఆమె చెంగున మంచె మీది కెక్కి మళ్ళీ నాలుగు మూలలా పరకాయించి చూచింది:

"అదిగో! దూరంగా ఆ మూలేదో కదులుతూన్నట్టుంది. అదిగో! అదిగో! అటు వెళ్ళండి!"

ఆ మాటలు వింటూనే ఆశ్వికులంతా అటువైపు పడి పోయారు. మళ్ళీ యింకొక అరగడియలో అలాగే తిరిగి వచ్చారు. సుమారు మనిషెత్తు వరకు ఒత్తుగా పెరిగిన ఆ జొన్న చేలో వారికంతా అంధకార బంధురంగానే కనిపించింది. ఈమారు వారెవరి ముఖాలలోనూ కత్తివాటు వేసినా నెత్తురు చుక్క కనబడ లేదు. ఆ ముఖాలు చూచి ఆ బాలిక అలాగే మంచెమీద కూర్చుని విరగబడి నవ్వింది. తన పక్కనే పడివున్న ఒక బల్లెం జాగ్రత్తగా గురి చూచి చేతికొద్దీ గట్టిగా విసిరింది. దూరదూరంగా ఆ అడవి పంది భరింపరాని వేదనతో అరిచిన సవ్వడి వినిపించింది.

ఆమె చెంగున కిందికి దూకి, మెరుపులా ఆ అడవి పంది పడివున్న చోటికి పరుగెత్తింది. చచ్చి పడివున్న దాని చెవి దొరకబుచ్చుకుని బరబరా అక్కడి కీడ్చుకు వచ్చింది. ఇంతవరకూ ఆమె అందం చూచి మైమరచిన హరసింహు డామె ధైర్యసాహసాలు, జబ్బ సత్తువ, చాతుర్యమూ చూచి, నోట మాట లేక అలాగే నిర్ఘాంత పోయి నిలుచున్నాడు. ఆ యువతి వారందరి ముఖాలూ కొంచెం పరకాయించి చూచింది:

"పాపం! మీరంతా బాగా అలిసినట్టున్నారే! దీన్ని కూడా మీతో తీసుకు వెళ్ళండి!"

ఆమె అడివి పందిని వారి కాళ్ళ దగ్గిర కీడ్చింది. వారందరికీ తమ ముఖాలన్నీ నేలమీద బోర్లా పడవేసి బరా బరా యీడ్చినంత తలవం

పయింది. అయినా వారంతా అది గమనించనట్లుగానే పైపైకి ఆమె నెంతో మెచ్చుకున్నారు. మరుక్షణంలోనే తమ గుర్రాలెక్కి ఆ సమీపంలో గుబురుగా పెరిగిన తాటితోపులో పడి అదృశ్యమైపోయారు.

2

ఆ నాటి వేట మర్యాదలలో ఒకరు వేటాడుతున్న జంతువు నింకొకరు చంపి వెయ్యడమే ఒక పెద్ద తలవంపు! అందులోనూ అది అడవి పంది వేట! తత్రాపి ముమ్మూర్తులా వీరవరేణ్యు లెంత ప్రయత్నించినా వేటాడలేని పిడుగు వంటి అడవి పందిని ఆ పడు చొక్క బల్లెపు వేటుతో చంపి వేసింది. ముగ్గురు సాయం పట్టినా మోసుకు రాలేని అడవి పందిని ఆమె ఒక్కర్తే చెవి పట్టుకుని బరబరా వారి దగ్గిరి కీడ్చుకు వచ్చింది. పైగా దాన్ని తీసుకు పొమ్మని దానం చేసింది!

ఆమె తెలిసి చేసినా తెలియక చేసినా అదంతా వారికొక పెద్ద తలవంపుగా పరిణమించింది.

పొద్దు వాలేసరికి వారంతా ఒక కొలను దగ్గిరికి చేరుకుని గుర్రాలకు నీళ్ళు పెట్టారు. నీరసంగా గుర్రాలు తోలుకుంటూ ఇంటి ముఖం పట్టారు.

రాణా హారసింహు డదంతా తలుచుకుని మరింత కుంగిపోయాడు. గుర్రం ఎటు పోతున్నదీ అతనికి గుర్తు లేదు. అది ఎలాగో అలాగ కాళ్ళీడ్చుకుంటూ నడక సాగించింది. మిగిలిన రౌతులంతా లోలోపలే మథన పడుతూ అలాగే స్వారీ సాగించారు.

అంతలో ఒక వడిసెలరాయి రివ్వున ఎగిరి వచ్చి హారసింహుని పంచకళ్యాణి కాలికి తగిలింది. వెను వెంటనే అది ఒక్క గంతువేసి నేలమీద కూలబడి పోయింది. హారసింహుడు కూడా దానితోపాటు నేల మీద కూలబడి పోయాడు. గుర్రం కాలికి దెబ్బ తగిలిన చోట ఒక పెద్ద గాయమయింది. రక్తం ధారకట్టి ప్రవహించింది.

మిగిలిన రౌతులు వెంటనే తమ గుర్రాలు దిగి పంచకళ్యాణి కాలి కేవేవో గచ్చాకు పుచ్చాకు వైద్యాలు చేశారు. కాని అది మళ్ళీ తిన్నగా నడవలేక పోయింది. అంతలోనే జొన్నచేను కాపలా కాచే పడుచు

రోజుకుంటూ అక్కడికి పరిగెత్తుకు వచ్చింది. రాణా హరసింహునికి సవినయంగా నమస్కరించి దోసిలి ఒగ్గి నిలబడింది. ఎంతో భయ భక్తులతో విన్నవించింది:

"బాబూ! నా వల్ల పెద్ద అపచారమే జరిగి పోయింది. పిట్టకు తగల వలసిన వడిసెల రాయి పొరబాటున మీ గుర్రం కాలికి తగిలినట్టుంది. నన్ను మన్నించండి!"

హరసింహు డొక నిముషం రెప్పపాటు లేకుండా ఆమె ముఖ వైఖరి పరిశీలించాడు. ఆమె పరియాచకమే ఆడుతూందో! ప్రాధేయ పడుతూందో! అతని కేదీ అంతు చిక్కలేదు. అలాగే ఆమె వైఖరి పరీక్షిస్తూ పంచకళ్యాణి పక్కనే నిలుచుండి పోయాడు. కొంచెం దూరంలో నిలబడి అదంతా గమనిస్తున్న ముసలి రౌతక్కడికి వచ్చి ఆమె కెదురుగా నిలబడ్డాడు.

"అమ్మాయీ! మీ నాయనగారి పేరెవరమ్మా?"

"చందన సింహులు."

"అలాగ చెప్పు మరి! ఆ తండ్రికి తగిన బిడ్డవే!"

"మరి నీ పేరు?" అన్నాడు రాణా హరసింహుడు.

"హీర."

"నిజంగా వజ్రపు తునకవే!" అని మెచ్చుకున్నాడు ముసలి రౌతు.

"తమ నామధేయం?"

ఎంతో వినయంగా అడిగింది హీర, రాణా హరసింహుని వైపు తిరిగి.

"వారు చితాడ్ దుర్గాధీశ్వరులు మన రాణా హరసింహ మహారాజులుంగారు! వారినే ఎరగవా?"

ఆశ్చర్య పడ్డాడు ముసలి రౌతు.

"అయ్యో! అలాగా! నిజంగా ఈనాడు నా వల్ల పెద్ద అపచారమే జరిగిపోయింది."

మళ్ళీ పశ్చాత్తాప పడింది హీర. తిరిగీ అందరికీ ఎంతో వినయంగా మనస్కరించింది.

"పోనీలే! కొట్టాలని కొట్టావా ఏమన్నానా! నీకేమీ భయం లేదులే."

అభయహస్త మిచ్చాడు ముసలి రైతు. వెంటనే వారంతా పంచ కళ్యాణిని వెంటబెట్టుకొని వెళ్ళిపోవాలని ఆలోచించారు. ఒక రైతు తన గుర్రం రాణా హారసింహుని కర్పించాడు. పంచకళ్యాణి కళ్ళెం చేత్తో పట్టుకొని రాణా వెనకాలే సాగిపోయాడు.

హారసింహుడు కొంత దూరం గుర్రం మీద స్వారీ సాగించాడు. అతని కెనకో విరగబడి నవ్వుతున్న సవ్వడి వినిపించింది. నిజానికప్పటికి రాణా చాలా దూరమే సాగిపోయాడు. అప్పుడతనికి హీర నవ్వు విని పించే అవకాశమే లేదు. అయినా మనసాప్పక ఒకమారు వెనుదిరిగి చూచాడు. దూర దూరంగా తోటి వనం మధ్యలో హీర సుస్మితం వజ్ర మాణిక్యంలా మెరిసింది. ఆ వజ్రం అతని హృదయంలో గాటంగా నాటుకు పోయింది.

ఆనాటి రాత్రి అంతా అతని కిక ఒక్క కునుకు పట్టలేదు. పంచ కళ్యాణి కాలికి తగిలిన వడిసెల రాతి గాయం నాలుగైదు రోజులలో మానిపోయిందిగాని ఆ సంఘటనాఘాతంవల్ల అతని హృదయంలో ఒక పెద్దగాయమే ఏర్పడింది. అది ఎన్నాళ్ళకీ మానిపోలేదు.పుండు సలిపిన ట్టది అలాగే సలిపింది.

రాణా తన రాణివాసంలోని పరిచారకులను కొందరిని పిలిపించి హీర పుట్టు పుర్వోత్తరాలన్నీ తెలుసుకున్నాడు. దర్శనానికి రావల సిందని తన ప్రధానామాత్యుని ద్వారా హీర తండ్రి చందన సింహుని కొక సందేశం పంపించాడు.

3

చందనసింహునికి కలిగినవా రయిదారుగురు ఆడపిల్లలే. హీర వారందరి లోనూ పెద్దపిల్ల.

చందనసింహుడు పూర్వపు చిత్తూరు రాణా కొలువులో కుదిరిన ఒక సామాన్య క్షత్రియ యోధుడు. పెద్దతనం బాగా పైబడటంవల్ల కొంత

కాలాని కతడు తన కొలువు చాలించు కొన్నాడు. రాణా హారసింహుని తాత ముత్తాతల కాలంనించీ తమ వంశం వారికి వీరమాన్యంగా సంక్ర మించిన జొన్న చేను దున్నుకుంటూ తన వార్ధక్యం సుఖంగా వెళ్ళ బుచ్చుకుంటున్నాడు. జొన్న చేనికి కొంచెం దూరంలో ఒక పెద్ద మర్రి క్రింద నిర్మించుకొన్న చిన్న కుటీరమే అతని కొక రాజ భవనంలా కని పించింది. మనస్సులో కొంచెం సంతృప్తి అంటూ వుంటే మనిషి కిక కావలసింది ఏమి వుంది!

ప్రధానామాత్యుని కబురందగానే అతనికి కొంచెం అనుమానమే కలిగింది. స్వతః అతడు రాణాలకు, అహంకార పూరితులయిన వారి అధికారులకు దూర దూరంగా తొలగి పోయే మనిషి. ఐశ్వర్యం పట్టక పోయినా అతని అభిజాత్యానికీ, అభిమానానికీ ఎన్నడూ, ఎక్కడా కొరత కలగ లేదు. అతనిలో పరి పరి విధాల మథన బయలుదేరింది. అది కనిపెట్టి హీర తనకు, రాణాకు మధ్య నడిచిన వ్యవహారం అంతా పూసగుచ్చిన ట్టతనితో చెప్పి వేసింది. దానితో అతని గుండెల్లో రాయి పడింది. రాణా తన మీద, తన కుమార్తె మీద బాగా ఆగ్రహించి వుంటాడనీ, ఏదో ఆపద తన మీద విరుచుకు పడనున్నదనీ భయపడ్డాడు. ఏది ఏమైనా సరే అతని గుండె రాయి చేసుకుని ముందుగా మహామాత్యుని దర్శనానికి వెళ్లాడు.

కాని మహామాత్యు డతని నెంతో గౌరవించాడు. మొట్ట మొదట చందనసింహు డా మర్యాద ధోరణి చూచి నిర్ఘాంతపోయాడు. మహా మాత్యుడు నెమ్మదిగా అసలు కథలోకి దిగి వచ్చాడు.

"రాణా హారసింహులు మీ అమ్మాయి హీర ధైర్యసాహసాల కెంతైనా సంతోషించారు."

"ఏదో తెలియని పిల్ల! దాని కేమి తెలుసును! తెలిసీ తెలియని కొంటెతనంవల్ల అది ప్రభువువారి యెడల అపచారమేమైనా చేసిందేమో నని భయపడుతున్నాను, బాబూ!"

"ఎంత మాట! అలాంటిదేమీ లేదు. పైగా రాణావారా అమ్మాయిని వివాహం చేసుకుని చిత్తూరు మహారాణిని చెయ్యాలని అభిలషిస్తున్నారు!"

ఆ మాట విని చందనసింహుడు ఉబ్బి తబ్బిబ్బై పోగలడని 'అనుకున్నాడు మహామాత్యుడు. కాని అటువంటిదేమీ జరగలేదు.

నిజానికి చందనసింహుడా మాట విని నిర్ఘాంతపోయాడు. "ఎంతటి రాణా అయితే మాత్రం తన కొలువు కూటానికి పిలిపించి, మంత్రి మాత్రునిచేత వివాహ ప్రస్తావన చేయిస్తాడా! ఇదెక్కడి రాచ మర్యాద?"

అని లోలోపల చాలా కించ పడ్డాడు. అదీగాక తనవంటి అతి సామాన్య సంసారికీ, చిత్తూరు రాణాకూ మధ్య జరిగే వియ్యం నలుగురిలోనూ నవ్వుల పాలు కాగలదని అతనికి స్ఫురించడాని కాట్టేసేపు పట్టలేదు. అయినా ఎంతో మర్యాదగా నచ్చజెప్పాడు.

"అన్నీ తెలిసిన వారు తమరు వేరే విన్నవించవలసిందేముంది? నక్క ఎక్కడ? నాగలోక మెక్కడ? మాకూ వారికీ మధ్య ఈ వివాహ ప్రస్తావన ఏమిటి చెప్పండి! ఇదేదో పరిహాసం కాదుగదా?"

అని చల్లచల్లగా చప్పరించివేశాడు. మంత్రి అనేక విధాలుగా అతనికి నచ్చజెప్పాడు. వివాహానికి ముమ్మందుగా రాణా అతని కొక చిన్న సామంతరాజ్యం అరణంగా బహూకరించగలరనీ, అటువంటి లోటు పాట్లేమీ రానివ్వరనీ గట్టిగా భరవసా ఇచ్చాడు. కాని, మహామంత్రి తన లేమి సంగతి ఎత్తగానే చందనసింహుని కెక్కడలేని అభిజాత్యమూ పొడుచుకు వచ్చింది. దానితో అతడు మరింత బిర్రబిగుసుకుపోయాడు. కాని, ఎంతో మర్యాదగానే మరి ఆ వివాహ ప్రస్తావన తనవద్ద ఎత్తవద్దని మహా మంత్రితో మనవిచేసుకున్నాడు. మహామాత్యుడు మళ్ళీ కొంచెం నయానా భయానా అతనికి నచ్చ జెప్పాడు. కాని, చందనసింహుడు విని పించుకోలేదు. మహామాత్యుని కిక ఒళ్లు మండిపోయింది.

"తలుచుకుంటే రాణావారు మీ మడి మాన్యాలన్నీ స్వాధీనం చేసుకుని క్షణంలో మీ హీరను బలవంతంగా వివాహం చేసుకోగలరు.

తెలిసిందా! కొంచెం జాగ్రత్తగా ఆలోచించుకుని మరీ సమాధానం చెప్పండి!"

మంత్రి పట్టరాని క్రోధంతో గజగజ వణికాడు. చందనసింహు డంతకన్నా రెచ్చిపోయాడు.

"మీరుకూడా ఎవరితో మాట్లాడుతున్నారో కొంచెం ఆలోచించు కుని మరీ మాట్లాడండి! సామాన్య సంసారులమయినంత మాత్రాన మీ బెదిరింపులకు జంకి లొంగిపోతామనుకున్నారేమో! నా బొందిలో ప్రాణం ఉండగా అటువంటి పని ఎన్నడూ జరగనేరదు - జాగ్రత్త!"

చందనసింహు డొరలోని కత్తి పైకిలాగి అది తళతళ మెరిపిస్తూ వీరవిహారం చేశాడు. ఉత్తర క్షణంలోనే ఒక్క దూకులో అత డక్కడి నుంచి బైటపడి తిన్నగా తన కుటీరానికి తిరిగి వచ్చివేశాడు.

4

మధ్యేమార్గంలో చందనసింహుడు తన సాహసం తలచుకుని ఉబ్బి తబ్బిబ్బైపోయాడు. కుటీరానికి తిరిగి వస్తూనే భార్యతో తనకూ, మంత్రికీ మధ్య నడిచిన వ్యవహారం అంతా ఏకరువు పెట్టాడు. ఆనాటితో కాచిన పాలవంటి తన వంశప్రతిష్ఠ వేయి రెట్లినుమడించిందని ఎంతో అహంకరించి మాట్లాడాడు. చందనసింహుని భార్య అదంతా విని నిలువునా నిర్ఘాంతపోయింది:

"అయ్యయ్యో! ఎంతపని చేశారు! స్వయంగా రాణావారే మన హీరను వివాహం చేసుకుంటానంటే వల్ల కాదని వీరాలాపా లాడి వచ్చారా? మీ వీరాలాపాల కిదా అదను? చాలు చాల్లెండి! ఎవరైనా వింటే నవ్విపోతారు! వెంటనే వెళ్ళి రాణా వారి కాళ్ళమీదపడి చేసిన తప్పు మన్నించమని ప్రార్థించండి! లక్షణంగా పిల్లనిచ్చి వివాహం చెయ్యండి! మీ కసలు కయ్యానికి కాలుదువ్వడంతప్ప ఇంకేమీ తెలియనే తెలియదే! ఎంతటి విడ్డూరం జరిగిం దీవేళ!"

అని ఆదేపనిగా పుండు సలిపినట్టు సలపడం మొదలు పెట్టింది.

ఆ క్షణంనించీ వారిద్దరిమధ్య పెద్ద రగడ చెలరేగింది. భార్య తక్షణం వెళ్ళి రాణాకు క్షమాపణ చెప్పుకోమని శతవిధాల పోరుపెట్టింది. చందనసింహుడు తన బొందిలో ప్రాణాలున్నంతవరకూ అటువంటిపని జరగనేరదని భీష్మించుకుని కూర్చున్నాడు. తానెన్నడూ బెదిరింపులకు లొంగేది లేదని కోరాలు మిరియాలు నూరాడు. ఆ పైన అటకమీద దాచి పెట్టిన కత్తులు, కఠారులు పైకితీసి నూరడం మొదలు పెట్టాడు. అయినా భార్య అతనిని విడిచిపెట్టలేదు. క్రమంగా వారిద్దరిమధ్య పచ్చగడ్డి వేసినా భగ్గుమని మండింది. ఆ రభస క్రమంగా బాగా మితిమీరి పోయింది.

ఒకనాటి సాయంకాలంవేళ హీర ఇంటికి తిరిగివచ్చే వేళ కొ గందరగోళం మళ్లీ ప్రారంభమయింది. హీర ఇక మాట్లాడకూరుకోవడం మంచిదికాదని నిశ్చయించింది.

"ఆమ్మో! ఎందుకింత పోరు? నాకీ సంబంధము సుతరామూ ఇష్టంలేదు! ఎంతటి రాణా లయితేమాత్రం! దౌర్జన్యం చేస్తామని బెదిరిస్తారా? నీ వెంత పోరినా సరే! నే నీవివాహాని కంగీకరించేది లేదు! మళ్ళీ ఎప్పుడయినా నా ఎదట ఈ మాట తలపెట్టావంటే ఆ మరుక్షణమే బల్లెంతో పొడుచుకొని చచ్చిపోతాను. దానితో అందరిపీడా ఒక్కసారిగా విరగడైపోతుంది, అంతే!"

అని రుసరుసలాడుతూ అక్కడినించి వెళ్ళి పోయింది హీర.

చందనసింహుడు యుద్ధరంగంలో ఎందరెందరో మహావీరులను సంహరించి అసహాయ శూరు డనిపించుకున్నాడు. కాని, భార్య నోరంటే అతని కెక్కడలేని భయము పుట్టుకొస్తుంది! ఇన్నాళ్లనించీ అత డామెతో కేవలం ఏకాకిగానే పోరాడి బాగా అలిసిపోయాడు. ఇప్పుడు కూతురు కూడా భరవసా ఇవ్వడంతో అతని కొక్కమారుగా కొండంత ధైర్యం వచ్చింది:

"విన్నావా! పిల్ల అన్న మాట! అందుకనే మన పెద్దలు ఏగూటి చిలక ఆ గూటి పలుకే పలుకుతుందని అంటారు! పెద్దల మాట ఊరికే పోతుందా?"

"అదిమాత్రం ఏం తీసిపోయిందీ! ముమ్మార్తులా మీ కూతురే! కానివ్వండి. ఇంతకీ దైవఘటన ఎలాగుందో అలాగే జరుగుతుంది."

చందనసింహుని భార్య నోరప్పటికి కొంచెం శాంతించింది. కాని ఆమె రుసరుసలాడడం మాత్రం మానలేదు. కూతురింటిదగ్గర లేనప్పుడు భర్తతో ఆమాటే తలపెట్టి అనేకవిధాల వాపోవడం మొదలు పెట్టింది. రాణాకు కోపం వస్తే ఏమయినా చెయ్యగలరని భయపెట్టింది. కాని చందనసింహు డది లక్ష్యపెట్టనే లేదు.

5

చందనసింహుడు హీర నీయడాని కంగీకరించలేదన్న వార్త చెవిని పడ్డప్పటినుంచీ హారసింహుని కామెను వివాహమాడి తీరాలన్న కోర్కె మరింత ఎక్కువై ఇనుమడించింది. హీరచేసిన అవమానం వల్లనే అతని కామెపై అనురాగం ప్రాదుర్భవించింది. ఆమె తండ్రి తిరస్కారంతో అది మరింత విజృంభించింది. మొట్టమొదటి క్రోధావేశంలో అతడు చందనసింహుని కారాగారంలో పడవేయించి హీరాను బలాత్కారంగా వివాహం చేసుకోవాలని సంకల్పించాడు. కాని దానిమూలంగా అనేకమైన విపరీత పరిణామా లేర్పడవచ్చునని అతనికి భయం వేసింది. ఆ వార్త తెలిసిన చందనసింహు డెలాంటి అఘాయిత్యానికయినా ఒడిగట్టవచ్చును! ఆ రోజులలో రాజపుత్రు లెలాంటి సాహసాలకైనా సిద్ధపడేవారు. అదీగాక ఆ విధంగా హీర మనసు నొప్పించడంకూడా అతనికి రుచించలేదు.

నానాటికీ హీర నొక్కమారైనా కళ్లారా చూడకుండా ఉండడం అతని కసాధ్యమైపోయింది. దూరదూరంగా తోటివనంలో కనిపించే హీర ముఖమే అతని హృదయాని కొక చంద్రబింబంలా స్ఫురించింది.

హారసింహు డొకనాటి సాయంకాలంవేళ వాహ్యాళికని మిషపెట్టి హీర సందర్శనానికే బయలుదేరాడు.

అప్పటి కామె మంచెదిగి అనతిదూరంలోఉన్న తన కుటీరానికి బయలుదేరింది. ఆనాడామె తీరతని కతివిచిత్రంగా కనిపించింది.

హీర తలపై ఒక చిన్న పాలకడవ. ఆమె కిటు అటు రెండు వైపులా రెండు మేకపిల్లలు. ఆమె రెండింటి మెడ తాళ్ళూ రెండు

చేతులతోనూ పట్టుకుని, తలమీది పాలకడవలోని పాలొక్కచుక్కైనా తొణికిపోకుండా నెమ్మది నెమ్మదిగా నడిచి వస్తూంది.

హారసింహుడు కొంచెం దూరంనుంచే ఆమె రాక గమనించాడు. తన గుర్రం ఆమెకు కొంచెం దగ్గిరిగా నడిపించి, ఆ మేకపిల్లల్ని రెండింటినీ బెదరగొట్టాలని అతనికొక ఊహ తట్టింది. అలాచేస్తే ఆమె తలమీద పాలకడవ నేలమీద పడిపోతుంది. అప్పుడామెకు సహాయం చేసినట్టు నటించి, సన్నసన్నగా ఎత్తిపొడిచి తనకు జరిగిన అవమానానికి బదులు తీర్చుకోవచ్చును! ఆమెను కొంచెం కవ్వించి నవ్వించవచ్చును. అదీ అతని ఊహ!

అత డతిజాగ్రత్తగా పంచకళ్యాణిని నడిపించాడు. ఆమె కొంచెం సమీపించగానే హఠాత్తుగా కళ్ళెం కొంచెం సడలించాడు.

ఆమె దూరంనించే అది కనిపెట్టింది. తన రెండు మేక పిల్లల మెడతాళ్లు ఒదిలి పెట్టింది. ఒక్కమారుగా రెండింటినీ గుర్రం ముని కాళ్ళ మధ్యకు తరిమింది.

ఆ హఠాదాఘాతానికో గుర్రం బెదిరి ఒక్కమారుగా ఎగిరి గంతేసింది. హారసింహుడు దాని ఆఘాతానికి తట్టుకోలేక కుప్పగా నేల మీద కూలబడ్డాడు. గుర్రం గట్టిగా సకిలించింది. పాపం, హారసింహునికి కొంచెం గట్టిదెబ్బే తగిలింది. అయినా అతడు తనకేమీ దెబ్బ తగలనట్టే నటించాడు.

అంతలో హీర తన నెత్తిమీదవున్న పాలకడవ నెమ్మదిగా దించి ఒక చెట్టుక్రింద పెట్టి అతనిదగ్గిరికి వచ్చింది. ఆమెను చూచి హారసింహుడు లేచి కూర్చుని ఒక్క చిరునవ్వు నవ్వాడు.

"పాపం, నీకుగాని ఏమీ దెబ్బ తగలలేదుకదా!"

"నాకేమీ తగలలేదుగాని మీకే ఏమైనా కొంచెం గట్టిదెబ్బ తగిలిందేమోనని భయపడుతున్నాను. పాడు పంచకల్యాణి ఎంత పని చేసింది!"

హీర ఆ నిందంతా తన పంచకల్యాణి మీదికి నెట్టివేసిందని హారసింహుడు గ్రహించుకొన్నాడు. కొంచెంసేపామెకేసి చూచి చిన్న చిరునవ్వు చిలకరిస్తూ అడిగాడు:

"సరేగాని హీరా! నిన్నిప్పు డమాంతంగా ఎత్తుకుని నా గుర్రం మీద కూర్చోబెట్టుకుని తిన్నగా మా కోటకు తీసుకుపోతే నీ వేమి చెయ్యగలవు?"

హీర కలకల నవ్వింది.

"మహాప్రభూ! పాలవంటి సుక్షత్రియవంశంలో అవతరించిన చిత్తూరు రాణాలకు పందిని కొట్టడమే బంటుతనం అనుకొన్నానుగాని బాలికల నపహరించుకుపోవడం కూడా వారి కొక బంటుతనం అనుకో లేదు! అయినా భయంలేదు. ఇదిగో కైజారు!"

హీర మొలనూలిలోనించి తటాలున పైకిలాగిన కైజారు హార సింహుని కళ్లె దురుగా తళతళలాడింది!

"ఆ కైజా రెందుకులే! నీ క్రీగంటి చూపు చాలదా నా ప్రాణం తీయడానికి!" హారసింహుడు మళ్లీ కలకలా నవ్వాడు.

"అయితే, హీరా! నిజంగా నిన్ను నే నపహరించుకుని పోతాననే అనుకొన్నావా? ఊరికే పరిహాసాని కన్నా నంతే!"

తలవని తలంపుగా హారసింహుడు విసిరిన ఛలోక్తికి హీరకూడా నవ్వకుండా ఉండలేకపోయింది:

"నేను మాత్రం క్షత్రియధర్మ పరిపాలకులయిన తమరిని కైజారుతో పొడిచివేస్తాననే అనుకొన్నారా? ఊరికే మాటవరస కన్నా నంతే!"

రాణా మళ్ళీ ఇంకొకమా రామె చేతిలో పరాజయం పొందాడు. అయినా కొంతసే పామెపై పలాగే నిశ్చలదృష్టితో చూచాడు.

"అయితే, హీరా! ఒక మాట? మీ నాయనగారి యెడల నే నేమి అపరాధం చేశాను! వారికి నా యెడల అంత వైమనస్యం కలగడానికి కారణ మేమిటి?"

హీర ఆ ప్రశ్న వినీ విననట్లుగా మాట్లాడకూరుకుని నేలకేసి చూస్తూ కూర్చుంది.

"హీరా! నీవుకూడా నామీద దయతప్పిందా! మాట్లాడవేమి?"

హీర రుసరుసలాడుతూ లేచి నిలబడింది:

"మహాప్రభూ! తమకు మావంటి నిరుపేదల దగ్గర ప్రాధేయపడ వలసినంత అవసరం ఏమి వచ్చింది? తలుచుకుంటే తమ సైన్యం పంపించి ఎలాంటి రాజకన్యకలనయినా మీ అంతఃపురంలో బంధింపించగలరు! చిత్తూరు పురాధీశ్వరులు-తమకేమి లోటు?"

హీర పాలకుండ మళ్లీ తలపై పెట్టుకుని మేకపిల్లల్ని రెండింటినీ వెంటపెట్టుకుని చరచరా నడిచి వెళ్ళిపోయింది! హారసింహు డామెకేసి చూస్తూ ఉసూరుమని ఒక్క దీర్ఘ నిశ్వాసం విడిచిపెట్టాడు.

ఆ మరునాటి ఉదయమే రాణా రాజపురోహితునితోను, ప్రధానామాత్యునితోను కలిసి తన కుటీరానికి విచ్చేయ నున్నాడని చందనసింహుని కొకవార్త చేరింది. అది విని అతడు కొంత సేపెంతో ఆశ్చర్య పోయాడు. వెంటనే ఆ విషయం భార్యతో అన్నాడు.

"మీరు రామాత్రం మంచీ, మర్యాదా నిలబెట్టుకోలేకపోయారు కాని రాణా ఆ మాత్రం మంచీ, మర్యాదా లేనివారు కాదు! ఇప్పుడైనా మహారాజ మర్యాద కేమీ లోటురాకుండా చూసుకోండి!"

అని వెంటనే ఆమె స్వాగత సన్నాహంలో మునిగిపోయింది. రాణా రాకమాట వినగానే చందనసింహుని పట్టుదల, పంతము, పౌరుషము అన్నీ సడలిపోయాయి. కాని తీరా పిల్లనిస్తానని మాటఇస్తే హీర ఏమి అఘాయిత్యాని కొడిగడుతుందోనని అతనికి బాగా భయంవేసింది. కాని భార్య దాని కేమీ భయపడనక్కర లేదని భరవసా ఇచ్చింది. అయినా చందనసింహుని కనుమానం తీరలేదు.

"తన దగ్గర ఈ వివాహం మాటే తలపెట్టవద్దని అది అనేక మారులు కసిరికొట్టింది. తీరా తొందరపడి మాట ఇస్తే..."

"మీ కా భయ మేమీ అక్కరలేదు! మొట్ట మొదటి నించీ దాని కీసంబంధం ఇష్టమే! అయితే మీ అభిజాత్యానికీ, తన అభిమానానికీ కట్టుబడి అలాగ కసరికొట్టింది అంతే!"

"అది నీతో ఎప్పుడైనా ఆ మాట చెప్పిందా?"

చందనసింహుని భార్య ఆ మాట విని విరగబడి నవ్వింది.

"అయ్యో! అది నోరువిడిచి మనతో చెబుతుందిటండీ! దాని మనస్సుమాత్రం నాకు తెలియదా?"

"అయితే నాతో ఆ మాట మొదటే ఎందుకు చెప్పావు కావు?"

"చెప్పినవన్నీ చెల్లించారు గనకనా, ఇక ఇది కూడా చెప్పడానికి! లేవండి. రాణావారప్పుడే వస్తున్నట్లున్నారు!"

ఆ పూట హీరా, హరసింహుల వివాహం యథావిధిగా స్థిరపడింది.

ఆ సాయంత్రం హీర విసిరిన వడిసెలరాయి చిత్తూరు కోట గోపురంపై ప్రతిష్ఠించిన సువర్ణ కలశానికే తగిలింది. అది అరగడియవరకు ఖంగని మారుమోగింది!